క్లుప్తంగా

అమ్మవారికి అభిషేకం



సల్లాపురెమ్మకు అభిషేకం చేస్తున్న వేదపండితులు

బైరెడ్డిపల్లి: స్థానిక ఎస్సీ కాలనీలో నిర్వహిస్తున్న శ్రీసల్లాపురెమ్మ ఆలయ జాతర మహోత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారికి 108 బిందెలతో పుసుపు, కుంకుమ నీటిలో కలిపి అభిషేకించారు. అనంతరం పాలాభిషేకం, లక్ష పుష్పార్చన, సహస్త్ర దీపాలంకరణ నిర్వహించారు. ఉపవాసదీక్షలో మహిళలు అమ్మవారికి 108 బిందెల నీటిని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి, అభిషేకాలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచే కాక కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి సైతం భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణం జనసందోహంతో కిక్కిరిసింది. భక్తులకు ఆలయ నిర్వాహకులు ప్రసాదాలను అందజేశారు.

వైఎస్సార్‌సీపీదే గెలుపు

గంగవరం: రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం వెలువడే సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో పలమనేరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేగౌడకు గంగవరం మండలం నుంచి ఐదు వేల పైచిలుకు మెజారిటీ సాధించడం తథ్యమని పార్టీ మండల కన్వీనర్ మోహన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల ఫలితాల అనంతరం రాష్ట్రంలో రెండవసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేస్తారని, అలాగే చిత్తూరు ఎంపీగా రెడ్డెప్ప, పలమనేరు ఎమ్మెల్యేగా వెంకటేగౌడ గెలుపొందడం ఖాయమన్నారు. ఇదలా ఉంచితే, చిత్తూరు ఎస్వీ సెట్ కళాశాల ఓట్ల లెక్కింపు కేంద్రానికి వెళ్లే కౌంటింగ్ ఏజెంట్లు ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకూ చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కింపును నిశితంగా పరిశీలించాలన్నారు. 144 సెక్షన్ అమల్లో ఉన్న నేపథ్యంలో పూర్తి ఫలితాలు వెలువడే వరకూ మండల పార్టీ శ్రేణులు సంయమనం పాటించి పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించాలన్నారు.

అమ్మరాజుపల్లెలో 'ఫ్యామిలీ డాక్టర్'



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహిస్తున్న డాక్టర్ మౌనిక

పెద్దపంజాణి: మండలంలోని అమ్మరాజుపల్లెలో పెద్దపంజాణి ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి మౌనిక సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గర్భవతులు, బాలింతలు, బీపీ, మధుమేహ వ్యాధిగ్రస్తులకు ప్రత్యే క పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య సేవలు అందించారు. సీజనల్ వ్యాధులు ప్రబల కుండా జాగ్రత్తలు పాటించాలని గ్రామస్తులకు తెలియజేశారు. గర్భవతులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి లావణ్య, ఏఎన్ఎం హరిప్రియ, ఆశా వర్కర్లు రెడ్డెమ్మ, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించిన సర్పంచ్



రీబోరు వేయిస్తున్న సర్పంచ్ రాజ్‌గోపాల్

రామకుప్పం: మండలంలోని బందార్లపల్లె పంచాయతీ బోయినపల్లెలో నీటి సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇది తెలుసుకున్న స్థానిక సర్పంచ్ రాజ్‌గోపాల్ గ్రామంలో రీబోరు చేయించి మోటారును అమర్చారు. దీంతో తాగునీటి సమస్య పరిష్కారం అయింది. గ్రామస్తులు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నేడే ఉత్కంఠకు తెర

- వెలువడనున్న ఎన్నికల ఫలితాలు
- అభ్యర్థుల జాతకాలు తేలేది ఈరోజే
- ఉదయం 8 గంటల నుంచి చిత్తూరులో కౌంటింగ్
- గెలుపుపై ఎవరి ధీమా వారిదే



వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెంకటేగౌడ



టీడీపీ అభ్యర్థి అమరనాథ్ రెడ్డి

పలమనేరు: 23 రోజుల టెన్షన్‌కు మంగళవారం తెర పడనుంది. బరిలోని అభ్యర్థుల జాతకాలు మరికొన్ని గంటల్లో తేలనున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి ఎన్నికల ఫలితాలపై తీవ్రమైన ఉత్కంఠ నెలకొంది. ఓటర్ల నాడిపై స్పష్టత లేకపోవడం, సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్న విషయాలు, సర్వేలతో జనం గందరగోళానికి గురయ్యారు. ఇక అభ్యర్థుల టెన్షన్ రోజుల నుంచి గంటల్లోకి వచ్చింది. పలమనేరు నియోజకవర్గ ఫలితాలను చిత్తూరు సమీపంలోని ముత్తిరేవులు ఎస్వీ సెట్ కాలేజీలో మంగళవారం వెల్లడించనున్నారు. ఇందుకోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈవీఎంలో నిక్షిప్తమైన ఓట్ల లెక్కింపుతో రెండు మూడు గంటల వ్యవధిలో ఫలితాలు వెల్లడికానున్నాయి. తొలుత సర్వీసు ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు ఉంటుంది. పలమనేరు నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 287 బూత్‌లు 21 రౌండ్లలో ఫలితాలు రానున్నాయి. జిల్లాలోనే ఎక్కువ ఓటింగ్‌శాతం జరిగిన పలమనేరు ఎన్నికల ఫలితాలు ఆలస్యంగానే వెలువడే అవకాశం ఉంటోంది.

ఓటింగ్ వివరాలు

మొత్తం ఓటర్లు	: 2,67,876
పోలైన ఓట్లు మొత్తం	: 2,35,476
పురుషులు	: 1,17,614
మహిళలు	: 1,17,862
పోలింగ్ శాతం	: 87.9

బరిలోని అభ్యర్థులు 14మంది

వివిధ రాజకీయ పార్టీల నుంచి నలుగురు, ఇండిపెండెంట్లు పదిమంది మొత్తం 14మంది బరిలో నిలిచారు. వైఎస్సార్‌సీపీ నుంచి ఎన్ వెంకటేగౌడ(ఫ్యాను) టీడీపీనుంచి ఎన్ అమరనాథ రెడ్డి(సైకిల్) కాంగ్రెస్ నుంచి బి.శివశంకర్(హస్తం), బీఎస్పీ నుంచి శోభ, చిరుత్త్తె కచ్చి నుంచి వినోద్‌కుమార్ బరిలో ఉన్నారు. ఇండిపెండెంట్లుగా అమరనాథ్ రెడ్డి(పెన్‌స్టాండ్),అమరనాథ్‌రెడ్డి ఆర్ (బకెట్), అరుణ్‌కుమార్(కరెంట్‌స్తంభం), సుబ్రమణ్యం(డిష్ యాంటిన్నా), ఉమా మహేశ్వర్‌రెడ్డి(ఫ్రయింగ్ ప్యాన్), దామోదర్ నాయుడు(విజిల్), కావలి పవిత్ర(గన్నా కిసాన్), బొమ్మనపల్లి లక్ష్మన్న(గాజు గ్లాసు) పదిమంది అభ్యర్థులు పోటీ లో ఉన్నా ఎన్నికల్లో ప్రధాన పోటీమాత్రం వైఎస్సార్‌సీపీ, టీడీపీల మధ్యే సాగింది.

గెలుపుపై ఎవరి అంచనాలు వారివే

అసెంబ్లీ ఫలితాల్లో గెలుపుపై ప్రధాన పార్టీ అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. తాను రెండోసారి గెలుపొందడం ఖాయమని, రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం తథ్యమని పలమనేరు వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థి వెంకటేగౌడ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు, ఉద్యోగులు, పురుషులు, నిరుద్యోగుల ఓట్లే తమను గెలిపిస్తాయని మాజీ మంత్రి అమరనాథ రెడ్డి ధీమాతో ఉన్నారు.

పలమనేరు ఎన్నికపై భారీ బెట్టింగులు

నియోజకవర్గంలోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా పలమనేరు గెలుపోటములపై జోరుగా బెట్టింగులు సాగినట్టు సమాచారం. ఎగ్జిట్ పోల్స్‌లో కొన్ని టీడీపీ, మరికొన్ని వైఎస్సార్‌సీపీయే అత్యధిక స్థానాలు గెలుస్తాయని ప్రకటించడంతో ఎవరికి వారే గెలుపు తమదేనని ధీమాతో ఉండగా, మరోవైపు బెట్టింగులు జోరందుకున్నాయి. దీంతో అందరి కన్ను పలమనేరుపైనే పడింది. ఇక్కడ మాజీ మంత్రి ఓటమి ఖాయమంటూ ఒకటికి డబుల్‌గా పందేలు కట్టుకున్నారు. మాజీ మంత్రి హ్యాట్రిక్ ఖాయమంటూ టీడీపీ నేతలు బెట్టింగ్‌లకు దిగినట్టు తెలిసింది.

గ్రామీణ మహిళలే అభ్యర్థి గెలుపులో కీలకం

నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ద్వారా ఈ ఐదేళ్లలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.2,210 కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లోకి పడింది. ఇందులో 87శాతం మహిళల బ్యాంకు ఖాతాల్లోకే నగదు చేరింది. దీంతో తమ కుటుంబాలు ఆర్థికంగా బాగుపడిన నేపథ్యంలో నియోజకవర్గంలోని మహిళలు భారీగా వైఎస్సార్‌సీపీకి ఓట్లు సైలెంట్‌గా వేశారని తెలుస్తోంది. ముఖ్యంగా ఇక్కడ పోలైన ఓట్లలో మొత్తం 1,17,862 మహిళా ఓటర్లుండగా వీరిలో 75వేలమంది గ్రామీణ ప్రాంతాలకు చెందినవారే. వీరిలో 80 శాతం మంది వైఎస్సార్ సీపీని మరోసారి కోరుకున్నట్టు తెలుస్తోంది. ఏదేమైనప్పటికీ ఫలితాలపై మాత్రం అందరిలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.



గతనెల 12న ఓట్లు వేస్తున్న మహిళలు (ఫైల్)





చిత్తూరులోని ఎస్వీసెట్‌లో పలమనేరు కౌంటింగ్ హాల్‌లో ఏర్పాట్లు

మంత్రి పెద్దిరెడ్డిని కలసిన పార్టీ నాయకులు



మంత్రి పెద్దిరెడ్డిని కలసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

రొంపిచెర్ల: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని తిరుపతిలోని ఆయన నివాసంలో మండలంలోని బొమ్మయ్యగారిపల్లె గ్రామ పంచాయతీ వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం కలిశారు. పుంగనూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి స్వగ్రామం కావడంతో ఆ గ్రామ పంచాయతీలో పోలింగ్ సరళి మంత్రి గురించి అడిగి తెలుసుకున్నారు. మంగళవారం చిత్తూరులో జరిగే కౌంటింగ్ కేంద్రాలలో ఏజెంట్లు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గుండ్లూరి రామచంద్రారెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, చంద్రమౌళి రెడ్డి,మోహన్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, లక్ష్మీ ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హద్దు మీరితే చర్యలు తప్పవు



పోలీసులతో మాట్లాడుతున్న సీఐ చంద్రశేఖర్

- పలమనేరులో 144 సెక్షన్ అమలు
- టీ దుకాణాలు, హోటళ్లు, దాబాలు బంద్
- పలమనేరు అర్బన్ సీఐ చంద్రశేఖర్ హెచ్చరిక

పలమనేరు: ఓట్ల లెక్కింపు మంగళవారం చేయనున్న సందర్భంగా పలమనేరులో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్టు అమలులో ఉంటుందని పట్టణ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక స్టేషన్‌లో పోలీసు సిబ్బందికి విధులపై మార్గదర్శనం చేశారు. పట్టణంలోని జనం ఎక్కువగా వచ్చే టీ దుకాణాలు, హోటళ్లు, దాబాలు మొదలైనవి తెరవరాదని స్పష్టం చేశారు. ఎన్నికల నేపథ్యంలో 200మంది దాకా రౌడీలు, పాత కేసుల్లో నిందితులను, గ్రామాల్లోని ఇబ్బందులు కలిగించే అనుమానితులను బైండోవర్ చేసుకున్నామని, వీరు పట్టణంలో కనిపించడానికి వీలు లేదన్నారు. ఎక్కడైనా నలుగురికంటే ఎక్కువగా గుమిగూడితే చర్యలు తప్పవన్నారు. రాజకీయ పార్టీ కార్యాలయాల వద్ద జనం గుమి గూడరాదన్నారు. సోషల్ మీడియా, వాట్సాప్‌లో ఎవరైనా పార్టీలకు విరుద్ధంగా రెచ్చగొట్టే పోస్టులు పెడితే అడ్మిన్‌తోపాటు షేర్ చేసిన వారిపై కేసులు తప్పవన్నారు. పట్టణంలో బాణసంచా కాల్చరాదని, ర్యాలీలు చేయరాదన్నారు. ప్రజలు దీనికి

ప్రశాంతతకు సహకరించండి

శాంతిపురం: ఓట్ల లెక్కింపు సందర్భంగా అంతా ప్రశాంత వాతావరణంలో ఉండేందుకు రాజకీయ పార్టీల శ్రేణులు, ప్రజలు సహకరించాలని రాళ్లబూదుగూరు ఎస్ఐ సుమన్ సోమవారం కోరారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, గొడవలకు దిగే వారిపై రౌడీషీట్ తెరిచి జైలుకు పంపుతామని హెచ్చరించారు. మండల వ్యాప్తంగా 144 సెక్షన్, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటాయన్నారు. నలుగురికి మించి గుమికూడటం, ర్యాలీలు నిర్వహించటం, బాణాసంచా కాల్చటం, ఇతర సంబరాలపై నిషేధం అమలులో ఉందని చెప్పారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులతో వివాదాలకు కారణమయ్యే వారిపై, వాట్సప్ గ్రూపు అడ్మిన్లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

దుకాణాలు తెరవొద్దు



ఆటోలో మైక్‌లతో హెచ్చరికలు చేస్తున్న పోలీసులు

వి.కోట: కోడ్ అమల్లో ఉండటం, ఓట్ల లెక్కింపు నేపథ్యంలో మంగళవారం మండలంలోని అన్ని దుకాణాలు మూసివేయాలని, పెట్రోల్ బంకుల్లో బాటిళ్లకు పెట్రోల్ పట్టరాదని సీఐ లింగప్ప కోరారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత దూషణలకు పాల్పడుతూ, రెచ్చగొట్టే పోస్టులు పెట్టినా, ఫొటోలు, వీడియోలను వాట్సాప్‌లో షేర్ చేసినా, స్టేటస్‌గా పెట్టినా చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత మండలంలో విజయోత్సవ ర్యాలీలు చేయడం, బాణసంచా కాల్చడం నిషేధమని ఆటోల్లో మైక్ ల ద్వారా పోలీసులతో హెచ్చరికలు జారీ చేశారు.

విజయోత్సవ సంబరాలు నిషేధం

పుంగనూరు: ఎన్నికలలో గెలుపొందిన వారి విజయోత్సవ సంబరాలను నిషేధిస్తున్నట్లు సీఐ రాఘవరెడ్డి సోమవారం సాయంత్రం విలేకరులకు తెలిపారు. జిల్లా ఎస్పీ మణికంఠ ఆదేశాల మేరకు 144 సెక్షన్ అమలు చేస్తున్నామన్నారు. ఎలాంటి ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించేందుకు అనుమతి లేదన్నారు. ఎన్నికల్లో గెలుపోటములను స్నేహపూర్వకంగా తీసుకోవాలని, ఎవరు విద్వేషాలకు లోను కాకుండా ఉండాలన్నారు. హద్దులు దాటి ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కౌంటింగ్, తరువాత ప్రశాంతంగా ఉండాలని, ప్రజా జీవనానికి ఎవరూ విఘాతం కలిగించరాదని కోరారు.

ఓవరాక్షన్ చేస్తే కేసులు

గుడుపల్లె: సార్వత్రిక ఎన్నికల ఫలితాల సందర్భంగా గ్రామాలలో అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ లక్ష్మీకాంత్ హెచ్చరించారు. ఓట్ల లెక్కింపు నేపథ్యంలో సోమవారం గుడుపల్లెలో పోలీస్ వాహనంలో ప్రజలను హెచ్చరించారు. టీ దుకాణాలు, హోటల్ పూర్తిగా మూసివేయాలన్నారు. ఫలితాల అనంతరం ర్యాలీలు, బాణసంచా కాల్చడం చేయరాదన్నారు. మండలానికి 70 మంది పోలీసులు అదనంగా వచ్చారని, మంగళవారం రోజున వీరంతా పహరా కాస్తారన్నారు. నాలుగు పోలీసు వాహనాలు మండలంలోని అన్ని గ్రామీణ ప్రాంతాల్లో పర్యటిస్తూ ఉంటాయని, అందరూ ఇళ్లకే పరిమితం కావాలని కోరారు.



రైల్వే స్టేషన్ కూడలిలో దుకాణదారులతో మాట్లాడుతున్న ఎస్ఐ లక్ష్మీకాంత్

మహిళా కానిస్టేబుల్‌కు కన్నీటి వీడ్కోలు



కానిస్టేబుల్ వేదవతి భౌతికకాయం

పుంగనూరు: అన్నమయ్య జిల్లా రాయచోటిలో పోలీస్‌స్టేబుల్‌గా పని చేస్తున్న వేదవతి(28)కి స్వగ్రామమైన భీమగానిపల్లెలో తల్లిదండ్రులు, బంధుమిత్రులు అశ్రునయనాలతో అంతిమ వీడ్కోలు పలికారు. ఆమె అంత్యక్రియలకు పెద్దసంఖ్యలో తరలివచ్చి వేదవతికి ఘన నివాళులర్పించారు. ఆదివారం వేదవతి విధి నిర్వహణలో ఉంటూ తుపాకితో కాల్చుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆత్మహత్యకు పాల్పడటానికి కారణాలేమితో పోలీస్ దర్యాప్తులో తేలాల్సి ఉంది.

సంయమనం పాటిద్దాం



మాట్లాడుతున్న నాగరాజు

వి.కోట: ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలువడునున్న సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పిఎస్ నాగరాజు కోరారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రజా తీర్పు ఏ విధంగా ఉన్నా ఫలితాల విడుదలైన తర్వాత ఎదుటి వారిని కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం, అవమానకరంగా మాట్లాడడం చేయరాదని విజ్ఞప్తి చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన చూసి ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డినే మరోసారి ముఖ్యమంత్రి చేస్తారని, పార్టీ గెలిచిన అనంతరం అందరూ ఏకతాటిపై ఉంటూ ఎవరూ బాణసంచా కాల్చరాదని, ర్యాలీలు నిర్వహించాలన్నారు. అందరూ ఇళ్లకే పరిమితమై ఎన్నికల కోడ్ నిబంధనలు పాటించాలని, పోలీసులకు సహకరించాలని కోరారు.

వాలీబాల్ విన్నర్స్ వేలూరు

రొంపిచెర్ల: మండలంలోని గానుగచింత దాసరిగూడెంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నీలో విన్నర్స్‌గా తమిళనాడుకు చెందిన వేలూరు జట్టు నిలిచిందని నిర్వాహకులు సి.వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం విన్నర్స్, రన్నర్స్ జట్లకు బహుమతులు అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు గొల్లపల్లెమ్మ ఉత్సవాల సందర్భంగా తమ తల్లి చెన్నూరి క్రిష్టమ్మ జ్ఞాపకార్థం ఈ టోర్నీ నిర్వహించినట్లు వెంకటేశ్వరరావు తెలిపారు. మొత్తం 16 జట్లు పోటీలకు వచ్చాయని, ఫైనల్స్‌లో నరసింగాపురం జట్టుపై వేలూరు గెలిచిందని చెప్పారు. విన్నర్స్, రన్నర్స్ జట్లకు రూ.20వేలు, రూ.10 వేల నగదు బహుమతులతో పాటు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జయరామయ్య, ఎంపీటీసీ బాబు, రెడ్డిశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విన్నర్స్ జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న టోర్నీ నిర్వాహకులు

చౌడేపల్లెలో 144 సెక్షన్

చౌడేపల్లె: ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలువడుతున్న నేపథ్యంలో చౌడేపల్లెలో 144 సెక్షన్, పోలీస్ యాక్టు 30 అమలులో ఉందని సీఐ కృష్ణారెడ్డి సోమవారం తెలిపారు. బస్టాండులో దుకాణాలేవీ తెరవరాదన్నారు. టపాకాయలు పేల్చడం, ర్యాలీలు, సంబరాలు చేయడం నిషేధమన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అన్నదానానికి విరాళం

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానానికి సోమవారం హైదరాబాద్‌కు చెందిన అఖిల్‌రెడ్డి నిత్య అన్నదానానికి రూ.1,11,116 విరాళంగా అందజేశారు. ఆ నగదును ఆలయ అధికారులకు నగదు రూపంలో అందజేశారు. వారికి ఆలయ అధికారులు స్వామి దర్శనభాగ్యం కల్పించారు. పండితుల ఆశీర్వచనాలతో పాటు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారులు వాసు, విఘ్నేష్ పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.86.70 వేలు

పలమనేరు: స్థానిక పాతపేటలోని సత్యగంగమ్మ ఆలయంలో సోమవారం హుండీ ఆదాయం లెక్కించారు. ఆలయానికి రూ.86,702 ఆదా యం లభించిందని ఈవో కమలాకర్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వైద్యానికి ఆర్థిక సాయం

పలమనేరు: నియోజకవర్గంలోని వీ.కోట మండలం గోనుమాకులపల్లెకు చెందిన మణికంఠ అనే యువకుడు లివర్ క్యాన్సర్‌తో బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇతని ట్రీట్‌మెంట్‌కు డబ్బు ఎక్కువగా అవుతుందని అక్కడి వైద్యులు తెలపడంతో ఈ విషయాన్ని ఆ గ్రామస్తులు సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఇది చూసి వాస్తవమేనని తెలుసుకున్న మండలంలోని మొరం గ్రామానికి చెందిన సర్వీస్ టు సొసైటీ నిర్వాహకులు అశోక్ ఆలమట్టి రూ.11 వేలకు ఆర్థిక సాయం చేశారు.

చిత్తూరు సామ్రాట్ ఎవరో..?

- అభ్యర్థుల రాజకీయ భవితం తేలేది నేడే
- 10 గంటకు పోస్టల్ బ్యాలెట్, 11 గంటలకు ఈవీఎం ఫలితాలు
- మధ్యాహ్నం 2 గంటలకు పూర్తి ఫలితాలు

చిత్తూరు అర్బన్: ఐపీఎల్‌లో లక్ష్యాన్ని చేరుకోవడానికి చివర్లో పడే టెన్షన్ అంతా ఇంతా కాదు. అక్కడ బంతి బంతికీ ఉత్కంఠ పెరుగుతూ ఉంటుంది. ఈ అనుభవం ఎలా ఉంటుందో ప్రత్యక్షంగా అనుభవించాలంటే మాత్రం మరో కొద్ది గంటల్లో జరిగే ఓట్ల లెక్కింపును చూడాల్సిందే. ఐపీఎల్‌లో ప్రతి బంతినీ బౌండరీ లైన్ దాటించడానికే బ్యాట్స్‌మెన్ ప్రయత్నిస్తుంటాడు. ఓట్ల లెక్కింపులో ప్రతి రౌండ్ నరాలు తెగే ఉత్కంఠను రేపుతుంది. ఏ పార్టీ అభ్యర్థికి ఎన్ని ఓట్లు మైనస్ చేశాం .. మనకు ఎన్ని ప్లస్ అయ్యాయంటూ లెక్కలేసుకుంటారు. చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన మంగళవారం జరిగే ఓట్ల లెక్కింపులో తొలిగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తారు. ఇది ఉదయం 10 గంటలకు పూర్తయ్యే అవకాశం ఉంది. అటు తరువాత 11 గంటలకు ఈవీఎంలలోని ఫలితాలు ఓ స్థాయికి వచ్చే అవకాశం ఉంది. మధ్యాహ్నం 12.30 గంటలకు ఈవీఎంలలో ఓట్ల లెక్కింపు పూర్తవుతుంది. తుదిగా ఎవరు గెలిచారనే విషయం మధ్యాహ్నం 2 గంటలకు పూర్తి స్థాయిలో ఫలితాలు వెలువడనున్నాయి.

పెరిగిన పోలింగ్ శాతం ఎటువైపో..?

చిత్తూరు నియోజకవర్గ పరిధిలో చిత్తూరు నగరంతోపాటు చిత్తూరు మండలం, గుడిపాల మండలాల్లో గత నెల 13న పోలైన ఓట్లను ఎస్వీ-సెట్ కళాశాలలో లెక్కిస్తారు. ఇందులో ఈవీఎంలలో పడ్డ ఓట్లతో పాటు పోస్టల్ బ్యాలెట్, సర్వీసు ఓట్లు కూడా ఉంటాయి. నియోజకవర్గ పరిధిలో 2019 ఎన్నికలతో పోలిస్తే ఈసారి పోలింగ్ 2 శాతం పెరిగింది. 2019లో జరిగిన ఎన్నికల్లో నియోజకవర్గంలో 1,93,089 మంది ఓటర్లు ఉంటే, 1,53,206 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 79.34 శాతంగా పోలింగ్ నమోదైంది. ఇందులో వైఎస్సార్ సీపీకి 91,206 ఓట్లు పోలయితే, టీడీపీకి 51,230 ఓట్లు పడ్డాయి. వైఎస్సార్‌సీపీకి దాదాపు 40 వేల మెజారిటీ వచ్చింది. ఈసారి జరిగిన జరిగిన పోలింగ్‌లో 1,64,788 మంది ఓటు హక్కును వినియోగించుకుంటే, వీరిలో మహిళలు 84,278, పురుషులు 80,493, ఇతరుల 17 మంది ఉన్నారు. 81.24 శాతం పోలింగ్ నమోదైంది. ఇవికాకుండా పోస్టల్ బ్యాలెట్ రూపంలో 4,207 మంది ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. పెరిగిన పోలింగ్ శాతం ఎటువైపు అనే విషయం మరికొద్ది గంటల్లో తేలిపోనుంది.



చిత్తూరు అసెంబ్లీ స్థానం కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీసుల పహారా

తొలి ఈవీఎం అదే..

నియోజకవర్గానికి సంబంధించి తొలి ఈవీఎం చిత్తూరు నగరంలోని మంగసముద్రం పోలింగ్ స్టేషన్ నుంచి ఓట్లను లెక్కిస్తారు. తొలి పది రౌండ్లలో చిత్తూరు నగరంలో పోలైన ఓట్లు, 11 నుంచి 13వ రౌండ్ వరకు చిత్తూరు మండలం ఓట్లు, చివరి నాలుగు రౌండ్లలో గుడిపాల ఓట్లను లెక్కిస్తారు. చివరి ఈవీఎం గుడిపాల మండలం పానాటూరు పంచాయతీలోని 226వ పోలింగ్ కేంద్రంలో పడ్డ ఓట్లను లెక్కించడంతో పూర్తవుతుంది.

ఓట్ల లెక్కింపు ఇలా..

ఎస్వీ-సెట్ కళాశాలలో ఓట్ల లెక్కింపు కోసం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. అలాగే ఎంపీ స్థానానికి పడ్డ ఓట్లను కూడా ఇక్కడే లెక్కించనున్నారు. తొలుత కౌంటింగ్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్లు, సర్వీసు ఓట్లను లెక్కిస్తారు. ఇందులో ఎంపీ స్థానానికి పోలైన ఓట్లను కలెక్టర్ సమక్షంలో, ఎమ్మెల్యే ఓట్లను ఆయా కేంద్రంలోనే లెక్కబెడతారు. ఇవి పూర్తవగానే ఈవీఎంలను (చిత్తూరుకు 226 ఈవీఎంలు) లెక్కిస్తారు. ఇందుకోసం 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. తొలుత 14 టేబుళ్లపై 14 ఈవీఎంలను ఉంచి అందులో ఏ పార్టీ అభ్యర్థికి ఎన్ని ఓట్లు పడ్డాయో అక్కడికక్కడే ఫలితాల బటన్ నొక్కి చూపుతారు. దీన్ని తొలి రౌండ్ అంటారు. ఇలా 16 రౌండ్లకు 224 ఈవీఎంలను లెక్కిస్తారు. చివరగా 17వ రౌండ్‌లో మిగిలిపోయిన ఈవీఎంలను లెక్కిస్తారు. ఈవీఎంల ఫలితాలు ఉదయం 11 గంటలకు ఓ అంచనాకు రానుండగా, మధ్యాహ్నం 12.20 గంటలకు పూర్తవుతుంది. అనంతరం వీవీ ప్యాట్ల చీటీలను లెక్కపెట్టడానికి నియోజకవర్గంలోని 226 పోలింగ్ కేంద్రాలను రాసి ఓ బాక్సులో వేసి, లాటరీ పద్ధతిలో 5 చీటీ లను బయటకు తీస్తారు. వచ్చిన నంబర్లలోని వీవీప్యాట్లను లెక్క పెడతారు. అనంతరం గెలిచిన అభ్యర్థిని ప్రకటిస్తారు. చివరి ఫలితాలు మధ్యా హ్నం రెండు గంటలకు వెల్లడయ్యే అవకాశం ఉంది.